

తన పుట్టిన రోజు సందర్భంగా ప్రగతి భవన్‌లో బీఆర్‌ఎస్ అధినేత ముఖ్యమంత్రి కేసీఆర్ నుంచి ఆశీర్వాదం తీసుకుంటున్న మహారాష్ట్ర బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి కల్వకుంట్ల వంశీధర్ రావు

## ఇంటింటా ఇన్నోవేటర్‌కు..22 మంది ఆవిష్కర్తలు



మార్కెట్ వాలిడేషన్ బూట్ క్యాంప్‌లో పాల్గొన్న ఆవిష్కర్తలు

సిటీబ్యూరో, అక్టోబర్ 27(నమస్తే తెలంగాణ): తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ (టీఎస్ఐసీ), అటల్ కమ్యూనిటీ ఇన్నోవేషన్ సెంటర్ (ఏఐసీ) ఆధ్వర్యంలో నిర్వహించిన మార్కెట్ వాలిడేషన్ బూట్ క్యాంప్‌లో 22 మందిని ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమానికి ఎంపిక చేశామని టీఎస్ఐసీ చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ డాక్టర్ శాంతా తౌటం తెలిపారు. టీ వర్క్స్‌లో చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సహకారంతో మార్కెట్ వాలిడేషన్ బూట్ క్యాంప్ నిర్వహించామని, ఇందులో ఆవిష్కర్తలు ఎంచుకున్న ఆలోచనలకు మరింత అభివృద్ధి చెందడానికి అవసరమైన వనరులు, ఇతర అంశాలపై పరిశీలన పూర్తయ్యిందని శాంతా తెలిపారు. ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 63 ఆవిష్కరణలు వివిధ రంగాలకు చెందినవి ఉండగా, అందులోంచి అత్యుత్తమమైన 22 ఆవిష్కర్తలను ఎంపిక చేశామని తెలిపారు.

## అత్యవసర వైద్యంపై అవగాహన తప్పనిసరి

- సెమీ కృషి అభినందనీయం : ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్
- రేపటితో ముగియనున్న 'ఎమర్జెన్సీ మెడిసిన్' కాన్ఫరెన్స్




సిటీబ్యూరో, అక్టోబర్ 27(నమస్తే తెలంగాణ): సొసైటీ ఫర్ ఎమర్జెన్సీ మెడిసిన్ ఇండియా (సెమీ) తన ప్రతిష్ఠాత్మక సిల్వర్ జూబ్లీ వేడుకల్లో భాగంగా మూడు రోజుల 'ఎమర్జెన్సీ మెడిసిన్ కాన్ఫరెన్స్-2023'ని శుక్రవారం హెచ్ఐసీసీలోని నోవాటెల్‌లో ప్రారంభించింది. ఈ కార్యక్రమానికి వర్చువల్‌గా ముఖ్య అతిథిగా హాజరైన ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ మాట్లాడుతూ, ప్రస్తుత రోజుల్లో అత్యవసర వైద్యం పాత్ర చాలా కీలకమని అన్నారు. దేశ జనాభా సుమారు 140 కోట్లకు పైగా పెరిగిందని తెలిపారు. బిజీ లైఫ్, జీవన శైలి దృష్ట్యా చాలా మంది అనారోగ్య బారిన పడుతున్నారని అన్నారు. పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. అత్యవసర సమయంలో వైద్య సేవలు అందించడంపై అవగాహన కల్పిస్తున్న సెమీ సభ్యులను ఆయన ప్రశంసించారు. ఆరోగ్య సంరక్షణ రంగానికి సరైన రోడ్ మ్యాప్‌కు ఈ సదస్సు మార్గం సుగమం చేస్తున్నదన్నారు. అనంతరం అపోలో హాస్పిటల్స్ గ్రూప్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీతారెడ్డి మాట్లాడుతూ, అత్యవసర సమయంలో ప్రజల ప్రాణాలు కాపాడుకునేలా సెమీ సభ్యులు చేస్తున్న కృషిని ఆమె అభినందించారు. ఎమర్జెన్సీ అనేది జీవన్మరణానికి సంబంధించిన విషయమని వివరించారు. కాగా ఈ సదస్సు రేపటితో ముగియనుంది. ప్రపంచ దేశాల నుంచి సుమారు 1500 మంది వైద్య నిపుణులు సెమినార్ల వారీగా ఈ సదస్సుల్లో పాల్గొంటున్నారు. అత్యవసర వైద్యం సమయంలో తీసుకోవాల్సిన అంశాలపై కూలంకషంగా చర్చోపచర్చలు సాగుతున్నాయి. కార్యక్రమంలో సెమీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ హరిప్రసాద్, సెమీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ శరవణ కుమార్, రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎక్మో వైద్యం.. దక్కింది ప్రాణం

- గోవా నుంచి ఎయిర్ అంబులెన్స్‌లో 18 నెలల చిన్నారి తరలింపు
- రెయిన్‌బో ఆస్పత్రి డైరెక్టర్ డా. దినేష్‌కుమార్ చిర్ల



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యులు దినేష్ చిర్ల, రమేష్ కంచర్ల తదితరులు

బంజారాహిల్స్, అక్టోబర్ 27(నమస్తే తెలంగాణ): దేశ వైద్య చరిత్రలోనే తొలిసారిగా అతి తక్కువ వయస్సు గల 18 నెలల చిన్నారి (బాలుడి)కి నగరంలోని రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ ఎక్మో చికిత్స అందించి రికార్డు సృష్టించింది. 29 రోజుల పాటు చిన్నారికి విజయవంతంగా ఎక్మో చికిత్స అందించి ప్రాణాలు కాపాడినట్లు రెయిన్‌బో వైద్యులు వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం బంజారాహిల్స్‌లోని రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ సీఎండీ డా.రమేష్ కంచర్ల, ఇంటెన్సీవ్ కేర్ విభాగం డైరెక్టర్ డా.దినేష్ చీర్ల వివరాలు వెల్లడించారు. గోవాకు చెందిన 18నెలల చిన్నారి బాలుడు 'ఎక్యూట్ రెస్పిరేటరీ డిస్ట్రెస్ సిండ్రోమ్' (ఏడీఆర్ఎస్)తో బాధపడుతున్నాడు. దీంతో తల్లిదండ్రులు స్థానిక హాస్పిటల్‌లో చేర్పించారు. హై ఫ్రీక్వెన్సీ వెంటిలేషన్‌తో పాటు 100 శాతం ఆక్సిజన్, హెచ్ఎఫ్ఓవీ సాయంతో వారం రోజుల పాటు చికిత్స అందించినప్పటికీ చిన్నారి బాలుడు ఆక్సిజన్‌ను తీసుకోలేకపోయాడు. దీంతో అక్కడి వైద్యుల సూచన మేరకు చిన్నారి తల్లిదండ్రులు రెయిన్‌బో హాస్పిటల్‌ను ఆశ్రయించారు. ఈ మేరకు రోగి వైద్య పరీక్షలను పరిశీలించిన రెయిన్‌బో వైద్యులు చిన్నారికి ఎక్మో చికిత్స అందించాలని నిర్ణయించారు. వెంటనే నగరం నుంచి గోవాకు చేరుకున్న రెయిన్‌బో వైద్యులు అక్కడి దవాఖానలో చిన్నారి బాలుడికి ఎక్మో చికిత్స ప్రారంభించి, ఎయిర్ అంబులెన్స్ ద్వారా నగరానికి తరలించారు. ప్రత్యేక వైద్య బృందాల పర్యవేక్షణలో రోగికి 29 రోజుల పాటు ఖచ్చితమైన ప్రణాళిక, 100 శాతం ఇన్‌ఫెక్షన్ కంట్రోల్ తదితర పకడ్బందీ వైద్య పద్ధతులతో విజయవంతంగా ఎక్మో చికిత్స అందించి, బాలుడి ప్రాణాలను కాపాడగలిగామని డా.దినేష్ చీర్ల తెలిపారు. ప్రస్తుతం చిన్నారి బాలుడు పూర్తిగా కోలుకున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో డా.కపిల్, డా.ఫర్హాన్ షేక్, డా.అనుపమ ఎర్ర పాల్గొనారు.

## 11 నెలల చిన్నారికి ఎక్మోపై చికిత్స అందించిన కిమ్స్ కడిల్స్

### పూర్తిగా కోలుకున్న పసిపాప




ఎక్మో అనంతరం ఆరోగ్యంగా ఉన్న చిన్నారిని చూపిస్తూ వివరాలు వెల్లడిస్తున్న కిమ్స్ వైద్యులు

శేరి లింగంపల్లి, అక్టోబర్ 27: స్వైన్ ఫ్లూ, న్యూమోనియాతో దవాఖానలో చేరిన ఏడాది వయసు కూడా లేని ఓ పసిపాప ప్రాణాలను గచ్చిబౌలిలోని కిమ్స్ కడిల్స్ వైద్యులు కాపాడారు. ఎక్మో సహాయంతో విజయవంతంగా చికిత్సను అందించారు. ఈ అరుదైన ఘటనకు సంబంధించి శుక్రవారం గచ్చిబౌలిలోని కిమ్స్ దవాఖానలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పిడియాట్రిక్ వైద్యులు సుమన్, అలేఖ్యలు వివరాలు వెల్లడించారు. 11 నెలల వయస్సు కలిగిన ఓ చిన్నారికి హెచ్1ఎన్1 న్యూమోనియా సోకింది. ఓ ప్రైవేట్ హాస్పటల్‌లో చేర్పించగా వెంటిలేటర్‌పై పెట్టి చికిత్సను అందించినా ఫలితం లేకపోవడంతో చివరకు కిమ్స్ కడిల్స్‌కు తీసుకువచ్చారు. వెంటనే సదరు చిన్నారిని ఎక్మో సహాయంతో 22 రోజులు చికిత్సను అందించి మరో 10 రోజులు ఐసీయూలో ఉంచి చికిత్సను అందించి ప్రాణాలు కాపాడినట్లు వైద్యులు పేర్కొన్నారు. చిన్న వయస్సులో ఎక్మో సహాయంతో చికిత్సను అందించి పాప ప్రాణాలు కాపాడడం అరుదైన చికిత్సగా తెలిపారు. ప్రస్తుతం పాప పూర్తిగా కోలుకుందని, విజయవంతంగా చికిత్స పూర్తయిన అనంతరం, ఆరోగ్యంగా ఉన్నదని పిడియాట్రిక్ వైద్యులు సుమన్, అలేఖ్యలు తెలియజేశారు.

## ఆకాశవాణి అమ్మ లాంటిది: కేవీ రమణాచారి



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న డాక్టర్ కేవీ రమణాచారి

రవీంద్రభారతి, అక్టోబర్ 27: పరుల కోసం ఆలోచించే వారికి భగవంతుడి కృప ఎల్లప్పుడు ఉంటున్నదని తెలంగాణ ప్రభుత్వ సలహాదారుడు డాక్టర్ కేవీ రమణాచారి అన్నారు. మహాత్మాగాంధీ, స్వామి వివేకానంద, మదర్ థెరీసా లాంటి వారు తమ కోసం కాకుండా పరుల కోసం పాటు పడ్డారని ఆయన చెప్పారు. సత్కళాభారతి 27వ వార్షికోత్సవం సందర్భంగా సత్కళాభారతి కార్టూన్ పోటీలు-2023, సత్కళాభారతి భాగవత పద్య గాన పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం కార్యక్రమాలను రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సభకు ప్రముఖ సినీ నేపథ్య గాయకులు, సంగీత దర్శకులు శ్రీ పార్థసారథి నేమాని అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసి ప్రభుత్వ సలహాదారుడు డాక్టర్ కేవీ రమణాచారి విచ్చేసి పోటీలలో విజేతలుగా నిల్చిన వారికి నగదు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కేవీ రమణాచారి మాట్లాడుతూ పాలగుమ్మి, శ్రీశ్రీ, దాశరథి, మంగళంపల్లి బాల మురళీ కృష్ణ వంటి గొప్ప గొప్ప మహనీయులు ఆకాశవాణి దూరదర్శని నుంచే అభివృద్ధి చెందారని, ఆకాశావాణి అమ్మలాంటిందని ఆయన అన్నారు. సత్కళాభారతి సత్యనారాయణ ఇంత మంచి కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం, ప్రముఖ కార్టూనిస్టు చిలువేరు మృత్యుంజయ మాట్లాడుతూ, చిన్నారులలో దాగిన సృజనను బహిర్గతం చేసేందుకు నిర్వహించిన ఈ పోటీలు అభినందనీయమన్నారు. నిర్వాహకుల సేవలు కొనియాడదగినవని కార్టూనిస్టు పోటీలకు న్యాయ నిర్ణేతగా వ్యవహరించిన మృత్యుంజయ అన్నారు. నవ్వించేది జోకు అని, నవ్విస్తూ కవ్వించేది హాస్యం అని ఆయన అన్నారు. కార్యక్రమంలో విశిష్ట అతిథిగా ఉదయశంకర్, ఆత్మీయ అతిథులుగా న్యాయ నిపుణులు విద్యాన్ శ్రీపానకంటి దక్షిణమూర్తి, హాస్యానందం ఎడిటర్ పి.రాము, వ్యవస్థాపక అధ్యక్షుడు జి.సత్యనారాయణ, యదు మోహన్ పాల్గొన్నారు.



తెలంగాణ బీసీ జాగృతి అలయ్ బలయ్

తెలంగాణ బీసీ జాగృతి అధ్యక్షుడు కేపీ మురళీకృష్ణ ఆధ్వర్యంలో నల్లకుంట డివిజన్ రత్నానగర్ వద్ద అలయ్ బలయ్ నిర్వహించారు. కుల మతాలకు, రాజకీయాలకు అతీతంగా గత మూడేండ్లుగా ఈ అలయ్ బలయ్ ఏర్పాటు చేస్తున్నట్లు మురళీకృష్ణ తెలిపారు. దీనికి ముఖ్య అతిథిగా బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళావరణం కృష్ణమోహన్‌రావు, సినీ హీరో సుమన్, మాజీ మంత్రి సి.కృష్ణ యాదవ్‌లు హాజరయ్యారు. – అంబర్‌పేట, అక్టోబర్ 27

## ధాన్యం కొనుగోళ్లు.. ఎల్లుండే..

మేడ్చల్, అక్టోబర్27 (నమస్తే తెలంగాణ) : మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఈ నెల 30న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నారు. జిల్లాలో 12 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనుండగా 30న ఏదులాబాద్, కీసరలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నారు. నవంబర్ 2న మరో 10 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు. 18 వేల ఎకరాలలో వరి పంటను సాగు చేయగా 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందన్న అంచానా మేరకు పౌరసరఫరాల శాఖ అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. వరి మొదటి రకానికి క్వింటాలుకు రూ. 2,203, రెండవ రకానికి రూ. 2,183 మద్దతు ధరను అందించనున్నారు.

### కనబడుట లేదు



ఈ ఫోటోలో గల బాబు కనబడుటలేదు. పేరు: **బొడ్రాయి శివాజీ,** తండ్రి **బొడ్రాయి రామాంజనేయులు,** నివాసం: 13-5-131 వి. రా మా రా వు నగర్, సాయిబాబా గుడి దగ్గర బోరబండ, బాలానగర్, రంగారెడ్డి, తెలంగాణ-500018. వయస్సు:15 సంవత్సరాలు, స్టూడెంట్. పై ఫోటోలోగల బాబు 22-10-2023న ఉదయం 6.00 గంటలకు బయటకు వెళ్ళిన తరువాత తిరిగి రాలేదు. బ్లూ కలర్ టీ షర్ట్, బ్లాక్ కలర్ ఫ్యాంట్ ధరించినాడు. ఎవరికైనా ఆచూకీ తెలిసినచో ఈ క్రింది నంబర్లను సంప్రదించగలరు.

**6302204825, 9110525021**